రైతు వేదికల నిర్వహణలో నిర్లక్ష్యం

● నిధులు బంద్.. వసతులు నామమాత్రమే

నల్లబెల్లి : వ్యవసాయ క్లస్టర్ల పరిధిలో అన్నదాతకు ఆధునిక సాగు మెళకువలు, సత్వర సేవలు అందించే లక్ష్యంతో రూ.22 లక్షలు చొప్పున వెచ్చించి నిర్మించిన రైతువేదికల నిర్వహణలో నిర్లక్ష్యం రాజ్యమేలుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు మూడేళ్లకుపైగా నిర్వహణ, పర్యవేక్షణ ప్రశ్నార్థకంగా మారిన దుస్థితి మండలంలో నెలకొంది. గత ప్రభుత్వం మండలంలో నల్లబెల్లి, ముచ్చింపుల, కన్నారావుపేట, నారక్కపేట, రాంపూర్ గ్రామాల్లో రైతు వేదికలు నిర్మించిన విషయం తెలిసిందే. రైతు వేదికల్లో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో సంబంధిత ఏఈఓలు రైతులకు అందుబాటులో ఉంటూ, మిగతా సమయంలో వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి సూచనలు, సలహాలు అందించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో రైతు వేదికల నిర్వహణ దిశగా గత ప్రభుత్వం స్వీపర్‌కు రూ.3 వేలు, సమావేశాల ఖర్చు కోసం రూ.2500, స్టేషనరీ, జిరాక్స్ రూ.1000, తాగునీటి కోసం రూ.500, చిన్నపాటి మరమ్మతులు, ఇతరత్రా ఖర్చుల కింద రూ.1000 ప్రభుత్వం ప్రతినెలా ఇవ్వాలని నిర్ణయించింది. మొదటి మూడు నెలలు మాత్రమే


నల్లబెల్లి రైతు వేదిక భవనం

నిధులు మంజూరు చేసినా తదనంతరం ప్రభుత్వం నిధుల విడుదలను నిలిపేసింది. దీంతో రైతు వేదికల నిర్వహణ సంబంధిత ఏఈఓలకు ఆర్థికంగా భారంగా మారింది.

వసతులు కరువు

వ్యవసాయ విస్తరణ అధికారులు రైతువేదికల్లో రోజు ఉంటూ రైతుల సందేహాలను నివృత్తి చేస్తూ సేవలు అందిస్తున్నారు. అధికారులు కూర్చునేందుకు ప్రభుత్వం కుర్చీలు, బల్లలు, మైక్‌సెట్ వంటి ఏర్పాట్లు చేసినా తాగునీటి, ఇతర వసతులను విస్మరించింది. సమావేశాలకు హాజరయ్యే రైతులకు మంచినీరు కూడా అందించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరుగుదొడ్ల నిర్వహణ లేక పోవడంతో కంపు కొడుతున్న దుస్థితి నెలకొంది.

వేతనం నుంచి ఖర్చు చేస్తున్నాం



రైతువేదిక నిర్వహణకు నిధులు ఇవ్వకపోవడంతో తాగునీటి, ఇతర అవసరాలకు వేతనం నుంచి ఖర్చు చేస్తున్నాం. రైతు వేదిక నిర్వహణ, కార్యక్రమాలకు డబ్బు అవసరం అవుతోంది. ప్రభుత్వానికి బిల్లులు పంపించినా మంజూరు చేయడం లేదు. ప్రతినెలా నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఉంది.

- మాడిశెట్టి విశ్వభాను, ఏఈఓ, గోవిందాపురం

నిధులు రావడంలేదు



ప్రభుత్వం రైతు వేదికల నిర్వహణకు నిధులు విడుదల చేయడం లేదు. ఈ క్రమంలో తాగునీటి, ఇతర అవసరాలకు ఏఈఓలు వారి వేతనం నుంచి ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వం వద్ద బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాము. బిల్లుల విడుదలకు కృషి చేస్తా.

- బన్న రజిత, ఏఓ, నల్లబెల్లి

పర్యావరణాన్ని పరిరక్షించాలి


వర్ధన్నపేట : మొక్క నాటుతున్న శ్రీధర్, తదితరులు

● మాజీ ఎమ్మెల్యే, దళితమోర్చా అధ్యక్షుడు శ్రీధర్

వర్ధన్నపేట : పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా మాజీ ఎమ్మెల్యే, బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అభివర్ణించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఎస్సీ కాలనీ గురువారం ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. మొక్కలను నాటడంతోపాటు సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల మహిళ అధ్యక్షురాలు కొండేటి అనిత, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండలంలోని వెంకటాపురంలో నిర్వహించిన గ్రామసభలో ప్రత్యేక అధికారి అనసూర్య మాట్లాడారు. చెత్తను తడి, పొడి వేరు చేసే క్రమంలో ప్లాస్టిక్ నిర్మూలన దిశగా ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వేరుగా సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లెక్కల అరుంధతి, ఏపీఓ శ్రీనివాస్, హెచ్‌ఓ జ్యోతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామారావు, పంచాయతీ కార్యదర్శి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట : ఏఎస్ఆర్ సేవా స్వచ్ఛంద సంస్థ బాధ్యుడు ఎర్రబోయిన రాజశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీఐ రఘుపతిరెడ్డి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా అభివర్ణించారు. పర్యావరణ వేత్త, ఉత్తమ సేవా అవార్డ్ గ్రహీత రాజశేఖర్ మాట్లాడుతూ ఓజోన్ పొరను రక్షించే దిశగా అధిక ఉష్ణోగ్రత అరికట్టడానికి ఇంధన కాలుష్యాన్ని నివారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రవికుమార్, ప్రతిభ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గిరగాని సుదర్శన్, స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్, కాసుల వెంకటాచారి, గుంటి సంజీవ, పోలీసు సిబ్బంది వీరన్న, శ్రీలత, మహేశ్, భిక్షపతి, రవి తదితరులు పాల్గొన్నారు.


దుగ్గొండి: మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి అనసూర్య


నర్సంపేట : మొక్క నాటుతున్న సీఐ రఘుపతిరెడ్డి


చెన్నారావుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

చెన్నారావుపేట మండలంలోని..

మెప్మా, ఈజీఎస్, గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఏపీఎం ముక్కెర ఈశ్వర్ మాట్లాడారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించడాన్ని అలవర్చుకోవాలని సూచించారు. వాడి పడేసిన ప్లాస్టిక్ సేకరణ, తదితరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఓ అరుణ, మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సురేందర్, టైపిస్టు రజిత, పంచాయతీ కార్యదర్శులు, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు కట్టయ్య, శ్రీలత, సుజాత, మంజుల, మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అభిషేక పూజలు



దుగ్గొండి : మండలంలోని నాచినపల్లిలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం రెండో రోజు కార్యక్రమంలో భాగంగా అభిషేక పూజలు నిర్వహించారు. యాగశాలలో నిత్య పూర్ణాహుతి, సాయంత్రం విష్ణు సహస్ర స్తోత్ర పారాయణం, ధ్వజ స్తంభానికి పంచామృత అభిషేకం, పుష్పాభిషేకం, ధాన్యాధివాసం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు కిడాంబి నర్సింహ దేశికన్ ఆచార్యులు, ఝెదుగురి రమేశ్‌మూర్తి, ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరి కిరణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠాపన


హోమం చేస్తున్న అర్చకులు, భక్తులు

నెక్కొండ : మండలంలోని కస్నాతండా శివారు రాంనగర్ కాలనీలో గురువారం బొడ్రాయి (గ్రామ దేవత), ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఈనెల 2 నుంచి మొదలైన వేడుకలు గురువారం ముగిశాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పూజ, హోమాలు చేపట్టగా గణపతి ఏకాదశి పద వాస్తు క్షేత్ర పాలక నవగ్రహ సర్వతోభద్ర మండల దేవతారాధన చేసి హోమాలు నిర్వహించారు. భువనేశ్వర విగ్రహానికి మాలమంత్ర హవనం చేశారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠాపనతో బలిహరణ చేశారు. కార్యక్రమంలో రామాలయ ప్రధాన అర్చకుడు బీవీఎస్.శాస్త్రి, జ్యోతిష్య వేద పండితుడు శ్రావణ్, వాస్తు సిద్ధాంతి అన్వేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



రాయపర్తి : మండల కేంద్రంలోని కేసీఆర్ కాలనీకి చెందిన కోట భిక్షపతి కుమార్తె హేమలత వివాహానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు గురువారం రూ.20 వేల సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లేతాకుల రంగారెడ్డి మాట్లాడారు. పేద కుటుంబానికి చెందిన భిక్షపతి కూతురు వివాహం తలపెట్టిన క్రమంలో ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో సాయం అందజేసినట్టు తెలిపారు. పేద కుటుంబాలకు ఫౌండేషన్ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, నర్సయ్య, మాజీ ఎంపీటీసీ ఐత రాంచందర్, నాయకులు ముద్రబోయిన సుధాకర్, గాదె రవీందర్‌రెడ్డి, గజవెల్లి ప్రసాద్, యాకుబ్, వెంకన్న, మైస వెంకటేశం, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పర్వతగిరి : మాజీ ఎంపీటీసీ, కో ఆప్షన్ సభ్యుడు షబ్బీర్‌ను అతడి తండ్రి నూరొద్దీన్ ఇటీవల మృతి చెందిన క్రమంలో వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్, స్థానిక పీఏసీఎస్ చైర్మన్ ఎం.మనోజ్ గురువారం పరామర్శించారు. తొలుత నూరొద్దీన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు యాకాంతం, మండల అధ్యక్షుడు చీమల భిక్షపతి, రంగు కుమార్, బొక్కల బాబు, మహేందర్, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

రాయపర్తి : మండలంలోని ఊకల్ గ్రామ శివారులోని పిల్లికుంటతండాకు చెందిన అజ్మీరా అభినవ్ చంద్ర అనారోగ్యంతో గురువారం మృతి చెందగా అతడి మృతదేహానికి తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నేపల్లి శివారులోని 132/33 కేవీ ఉపకేంద్రంలో మరమ్మతుల నేపథ్యంలో నర్సంపేట, దుగ్గొండి, నల్లబెల్లి మండలాల్లో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఆ శాఖ డివిజనల్ ఇంజినీర్ పి.తిరుపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్టు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

భూసమస్యల పరిష్కారమే ధ్యేయం


ఖానాపురం : మాట్లాడుతున్న ఏఓ సత్యప్రసాద్

● కలెక్టరేట్ ఏఓ సత్యప్రసాద్

ఖానాపురం : భూసంబంధిత సమస్యల పరిష్కారమే భూభారతి చట్టం ధ్యేయమని కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి (ఏఓ) సత్యప్రసాద్ తెలిపారు. మండలంలోని బుధరావుపేటలో గురువారం నిర్వహించిన సదస్సుకు ఆయన హాజరై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. రైతులకు సంబంధించిన భూసంబంధిత అన్ని సమస్యలనూ పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజా రేణుక, ఆర్ఐ స్వామి, ఏఎస్ఓ సుగుణ, సిబ్బంది గోవర్ధన్, స్వామి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండలంలోని సూరిపల్లి, చిన్నకొర్పోలు గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో తహసీల్దార్ రాజ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రవి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సూరిపల్లిలో 251, చిన్నకొర్పోలులో 175 దరఖాస్తులు అందినట్టు తెలిపారు.


నెక్కొండ : దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

రాయపర్తి : మండలంలోని కేశవాపురం, కొలన్‌పల్లి గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో తహసీల్దార్ శ్రీనివాస్ రైతులకు అవగాహన కల్పించారు. రైతులు సదస్సులను వినియోగించుకుని సమస్యల పరిష్కారంలో సహకరించాలని కోరారు. కార్యక్రమాల్లో ఆర్ఐ కొయ్యడ చంద్రమోహన్, సిబ్బంది రాజు తదితరులు పాల్గొన్నారు. దుగ్గొండి : మండలంలోని తొగర్రాయి, రేకంపల్లి గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో డిప్యూటీ తహసీల్దార్ ఉమాదేవి పాల్గొని దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. చట్టంపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. పట్టాదారు పాసు పుస్తకాల్లో వివరాల సవరణ, మిస్సింగ్ సర్వే నంబర్ల నమోదు, తదితరాల కోసం రైతులు దరఖాస్తులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐలు రాంబాబు, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ప్రశాంతత



నర్సంపేట రూరల్ : యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని హోమియో ఆస్పత్రి వైద్యురాలు శ్రీదేవి తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది వేడుకల్లో భాగంగా నర్సంపేటలోని ప్రభుత్వ హోమియో ఆస్పత్రిలో స్థానిక అంగన్‌వాడీ టీచర్లకు, పిల్లలకు, పిల్లల తల్లులకు యోగాపై గురువారం అవగాహన కల్పించారు. ఈనెల 21న తలపెట్టిన అంతర్జాతీయ యోగా దినోత్సంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. యోగా సాధనను దినచర్యలో భాగంగా అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో హోమియో ఆస్పత్రి సిబ్బంది ఉమామహేశ్వరి, అంగన్‌వాడీ టీచర్ వాణి, ఆశావర్కర్లు రాజమణి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్నేహ సంఘాలకు' చిత్రలేఖనం, ఇతర పోటీలు

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని వివిధ గ్రామాల్లో 14–18 ఏళ్ల వరకు వయసున్న బాలికలకు నిర్వహించిన స్నేహ సంఘాల సమ్మర్ క్యాంపు ముగింపు సందర్భంగా నేడు పలు అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్టు ఏపీఎం ముక్కెర ఈశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు (శుక్రవారం) పర్యావరణం, పర్యావరణ సమతుల్యత, ఓజోన్ పొర సమస్యలు, హరిత హారం లాంటి అంశాలు ప్రస్ఫుటించేలా చిత్రలేఖన పోటీలుంటాయని పేర్కొన్నారు. అలాగే స్నేహ సంఘాల అంశాలపై వక్తృత్వ పోటీ ఉంటుందని తెలిపారు. బాల కార్మికులు, బాల్య వివాహాలు, ప్రాథమిక విద్య, ఆరోగ్య, సెల్‌ఫోన్ వినియోగం, తదితరాలపై స్కిట్ పోటీ ఉంటుందని వివరించారు. ఆసక్తి కలిగిన బాలికలు పాల్గొని ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. విజేతలకు ఈనెల 10న ఆయా గ్రామాల్లో బహుమతుల పంపిణీ ఉంటుందని వెల్లడించారు.

రసాయన ఎరువుల వినియోగంతో నష్టం

● సీనియర్ శాస్త్రవేత్త సంధ్య కిశోర్

పర్వతగిరి : పంటల సాగులో రసాయనిక ఎరువుల వినియోగంతో నష్టం వాటిల్లుతుందని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.సంధ్య కిశోర్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. తక్కువ యూరియా వినియోగం వల్ల కలిగే లాభాలు వివరించారు. అధిక యూరియా వల్ల వివిధ పంటలకు చీడపీడలు భారీగా ఆశించి దిగుబడులు తగ్గడంతోపాటు సాగు ఖర్చు పెరుగుతుందని తెలిపారు. భూసారం సైతం దెబ్బ తింటుందని వివరించారు. రైతులు విత్తనాల కొనుగోలు సందర్భంగా రసీదు తీసుకుని పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలని సూచించారు. సాగు నీటి ఆదా పద్ధతులు, పంటల మార్పిడి, తదితరాలపై అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని కోరారు. ఖరీఫ్‌లో సాగు చేయాల్సిన వరి రకాలు, యాజమాన్య పద్ధతులు, చీడపీడల యాజమాన్యం, పప్పు దినుసుల గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది స్రవంతి, రాజేశ్, శ్రీకాంత్, మారి ఎన్‌జీఓ మేనేజర్ ఇన్నారెడ్డి, రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.


వర్ధన్నపేట : మాట్లాడుతున్న సంధ్య కిశోర్

యాజమాన్య పద్ధతులు పాటించాలి

నల్లబెల్లి : యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ పరిశోధన, సస్యరక్షణ శాస్త్రవేత్త రాజు కోరారు. మండలంలోని అర్వయ్యపల్లి, రుద్రగూడెం, గుండ్లపహాడ్, కొండాయిల్‌పల్లి, మేడపల్లి, రాంపూర్ గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. యూరియా, పురుగుల మందుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. భూసార పరీక్షల ప్రాముఖ్యత, పంట మార్పిడిపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో శాస్త్రవేత్తలు తమ్మి రాజు, దిలీప్, విశ్వతేజ, ఏడీఏ దామోదర్ రెడ్డి, ఏఓ బన్న రజిత, ఏఈఓలు విశ్వభాను, శివకుమార్, వినూష, మహేందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గోవధ నిషేధ చట్టాలను అమలు చేయాలి

● వీహెచ్‌పీ జిల్లా సహాయ కార్యదర్శి రవి

నర్సంపేట రూరల్ : గోవధ నిషేధ చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా సహాయ కార్యదర్శి మల్యాల రవి డిమాండ్ చేశారు. నర్సంపేటలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోవులను హిందువులు గోమాతగా పూజిస్తారని తెలిపారు. అంతటి ప్రాశస్త్యం కలిగిన గోవులను కొందరు అక్రమంగా కబేలాలకు తరలించి, వధించి మాంసాన్ని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆందోళన వెలిబుచ్చారు. అనుమతి లేకుండా బహిరంగంగా విచ్చలవిడిగా గోమాంసాన్ని విక్రయిస్తూ హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని చెప్పారు. రేపు (ఈనెల 7న) బక్రీద్ పర్వదిన నేపథ్యంలో గోవధ జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, అధికారుల మీదే ఉందన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మల్యాల రవి

బక్రీద్ సందర్భంగా బహిరంగంగా గోమాంసాన్ని విక్రయించే వ్యాపారస్తులపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్ గోరక్ష ప్రముఖ్ గన్నోజు నాగార్జున, నర్సంపేట కమిటీ అధ్యక్షుడు బొల్లేటి జగదీశ్వర్, కార్యదర్శి వేల్పుల శ్రీధర్, కోశాధికారి కలకోటి సుదర్శన్, భజరంగ్ దళ్ సురక్ష ప్రముఖ్ చరణ్, నాయకులు కుమార్, రేవంత్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం


కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు

నర్సంపేట : పట్టణంలోని న్యూ శ్రీరఘు పబ్లిక్ స్కూల్‌లో 1996–97లో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు మూడు దశాబ్దాల తర్వాత కలుసుకున్న నేపథ్యంలో మిత్రులు ఆనందంలో మునిగి తేలారు. తరగతి గదులను సందర్శించి బాల్యాన్ని గుర్తు చేసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని పరవశించిపోయారు. కేక్ కట్ చేశారు. తమకు విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. స్నేహం కొనసాగించాలని, సేవలు కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు పురుషోత్తం, లక్ష్మీనారాయణ, శరత్, వేణుగోపాల్, పూర్వవిద్యార్థులు ఎస్.కల్యాణి, బుర్ర స్వర్ణ, దోర్నాల మాధవి, చెరుకూరి రజని, దగ్గుపాటి పద్మజ, రాగిడి కల్యాణి, దాసరి సంధ్య, చింత శ్రీదేవి, రంగినేని మాధవి, జెండా జ్యోతిర్మయి, రావుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు


నెక్కొండ : శంకుస్థాపన చేస్తున్న రంజిత్‌రెడ్డి


నర్సంపేట : ప్రొసీడింగ్ కాపీలు ఇస్తున్న వీరారెడ్డి

● టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి

నెక్కొండ : అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని తోపనపల్లిలో లబ్ధిదారులు చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు గురువారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఇప్పటికే బేస్‌మెంట్ వరకు నిర్మించుకున్న లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున బ్యాంక్ ఖాతాలో జమ అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, గ్రామ కమిటీ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

పేదల కల సాకారం

నర్సంపేట : ఇందిరమ్మ ఇళ్లతో పేదల కల సాకారమవుతోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని జల్లిలో మాజీ సర్పంచ్ జరుపుల మారి భిక్షం కుటుంబానికి మంజూరైన ఇంటి నిర్మాణాన్ని ఆయన ముగ్గు పోసి భూమి పూజ చేసి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందన్నారు. అర్హులందరికీ విడతల వారీగా ఇళ్లు మంజూరవుతాయని చెప్పారు. అనంతరం అంబాల స్వరూప, జరుపుల బాలు, బోడ కిషన్‌లకు మంజూరైన ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తొగరు చెన్నారెడ్డి, బాదావత్ బాలునాయక్, అంబాల రవి, కొమ్మాలు, గంధం బాలరాజు, జక్క వెంకన్న, యాకూబ్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా..

ఖానాపురం : పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం దశలవారీగా మంజూరు చేస్తుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు తెలిపారు. మండలంలోని అయోధ్యనగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆయన భూమి పూజ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాదరావు, జగన్, సారంగపాణి, అచ్యుతం, యాకయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కల్పించండి

రాయపర్తి : మండలంలోని పెర్కవేడు గ్రామ పరిధిలోని వ్యవసాయ భూములకు వెళ్లే రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు. రైతులు, గ్రామస్తులు గురువారం సదరు రహదారిలోని ముళ్లకంప చెట్లను సొంత డబ్బుతో జేసీబీ ఏర్పాటు చేసుకుని తొలగించారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామస్తులు మాట్లాడారు. గ్రామంలోని అన్నారంకు వెళ్లే రహదారికి పక్కనే కోళ్లఫారాల పక్కన పెర్కవేడు నుంచి కొత్తతండాకు వెళ్లే రహదారి ముళ్లకంపచెట్లతో పూర్తిగా పేరుకుపోయిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు మంజూరైనా పనులు చేపట్టలేదని చెప్పారు. ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడంతో సొంత ఖర్చులతో ముళ్లకంప చెట్లను తొలగించినట్లు తెలిపారు. ఇకనైనా రహదారికి మరమ్మతు చేయించాలని, బీటీ రోడ్డు వేయిస్తే రెండు గ్రామాల సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో రైతులు గారె సోమయ్య, తోటకూరి సాయిలు, వంగాల స్వామి, గడిపెల్లి వీరస్వామి, వంగాల సంపత్, వంగాల కృష్ణ, గడిపెల్లి బిక్షపతి, తోటకూరి శ్రీను, గారె రాములు, గారె యాకయ్య, కుల్ల సూరయ్య, కుల్ల సంజీవ, గారె నర్సయ్య, ఐత సోమయ్య, ఐత కొంరయ్య, వేల్పుల భద్రయ్య, వీరయ్య, యాకయ్య, ఐత మల్లయ్య, చిన్నపాక భద్రయ్య, సుతారి ఉప్పలయ్య, మేకల ఎల్లమ్మ, సమ్మయ్య, సారయ్య, పాపయ్య, సుతారి నాగరాజు, సుతారి లక్ష్మీకాంతం, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.


ముళ్లచెట్లను జేసీబీతో తొలగిస్తున్న రైతులు

పోడు రైతుల ఆందోళన

గూడూరు: మండలంలోని బొల్లెపల్లి గ్రామ శివారులో ఐదేళ్లుగా పోడు సాగు భూములపై ఫారెస్టు అధికారుల అడ్డగింత, రైతులు ఆందోళనతో వారిని తిప్పి పంపిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం అటవీ శాఖ బీట్ ఆఫీసర్లు సాగు కోసం దున్నుతున్న పలువురు పోడు రైతులను అడ్డుకునేందుకు యత్నించారు. ఈ సందర్భంగా వాగ్వాదం చోటు చేసుకుంది. పోడు రైతులు ఆందోళన నిర్వహించారు. ఏటా ఇదే తంతు కొనసాగుతోందని, హక్కు పత్రాలు ఇస్తామని చెబుతూనే ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తోందని రైతులు డిమాండ్ చేశారు. సాగు రైతులకు పోడు హక్కు పత్రాలు ఇప్పించాలని కోరారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

మామునూరు : యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని మామునూరు ఇన్‌స్పెక్టర్ రమేష్ కోరారు. వరంగల్ నగర శివారులోని ఆర్టీఏ జంక్షన్ లెనిన్‌నగర్‌లో పోలీస్ కళా జాగృతి బృందం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్రజా చైతన్య కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యువత మద్యానికి బానిసై జీవితాలను చిన్నాభిన్నం చేసుకోవద్దని చెప్పారు. బాల్య వివాహాల నివారణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని చెప్పారు. పోలీసు కళాజాత బృందం ప్రదర్శించిన ఆటపాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్సైలు కృషివేణి, శ్రీకాంత్, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల్లో సదస్సులు నిర్వహించాలి

నర్సంపేట రూరల్ : భూసంబంధిత సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూభారతి సదస్సులను రెవెన్యూ గ్రామాల్లో కాకుండా అన్ని గ్రామ పంచాయతీల్లో (జీపీ) నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని రాజపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తుండడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రెవెన్యూ గ్రామాల నుంచి సుమారు 45 ఏళ్ల క్రితమే పంచాయతీలు విడిపోయాయని గుర్తు చేశారు. గ్రామ పంచాయతీల ఆవరణలో సదస్సులు నిర్వహిస్తే రైతుల, ప్రజల సమస్యల పరిష్కారానికి మరిన్ని మెరుగైన అవకాశాలు ఉండేవని చెప్పారు. సదస్సులు సక్సెస్ కావాలంటే గ్రామాల్లోనే నిర్వహించాలని తెలిపారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత శాఖల జిల్లా ఉన్నతాధికారులు సదస్సుల నిర్వహణపై పునరాలోచించాలని కోరారు.